# మానవుని యందున్న అసురత్వమును సంహరించటమే నరకాసుర సంహారములోని అంతరార్థము

వివిధ శాస్త్ర చయము వేదవేదాంగముల్
జీవి మనసు తెరను చీల్చలేవు
తెరకు యివ్వల జీవి దేవుడవ్వలనుండు
కార్యమివ్వల నవ్వల కారణంబు

**దివ్యాత్మస్వరూపులారా!**

భారతీయులయొక్క పండుగలు, పర్వదినములు భారతీయ సంస్కృతిని, సఖ్యతను, సమైక్యతను తెలిపే మహత్తరమైన పర్వదినములు. ప్రాచీన కాలము నుండి మహత్తరమైన శక్తివంతమైన భారతీయ సంస్కృతిని అర్థము చేసుకొనలేక అంతరార్థమును అంతకంటె తెలుసుకొనలేక మానవత్వమును వ్యర్థము గావించుకుంటూ వస్తున్నారు, భారతీయులు.

పండుగలకు, పర్వదినములకు బాహ్య, అంతరార్థములు లేకపోలేదు. కాని అట్టి బాహ్య, అంతరార్థములు గుర్తించటానికి మానవుడు అంత తీవ్రముగా ప్రయత్నించటము లేదు. లోకకళ్యాణార్థమై అవతరించిన అవతారములయొక్క జన్మదినములను, మహనీయులయొక్క జన్మదినములను మరియు లోక కంటకులైన, దుర్గుణ దురాచారములచే ప్రవర్తించిన దుర్మార్గులయొక్క మరణాన్ని గుర్తింపజేసే నిమిత్తమై పర్వదినములు ఏర్పడినవి. ఇక మహనీయుల జన్మదినములు మరియు దుష్టుల మరణముల దినములు గుర్తు తెచ్చుకొనే నిమిత్తమై ఏర్పడిన దినములుగా పండుగలను అనుభవిస్తూ వచ్చారు. ధర్మస్వరూపుడైన రామచంద్రుడు అవతరించిన దినము చైత్ర శుద్ధ నవమి. ఆనాడు రామ జన్మదినోత్సవమని పండుగగా మనము చేసుకుంటున్నాము. శ్రావణ బహుళ అష్టమి ధర్మస్థాపనకై అవతరించి కేవలము ధర్మ ప్రబోధను ఆచరించి గీతాచార్యుడని పేరుపొందిన కృష్ణుని జన్మదినముగా విశ్వసించి ఆ అష్టమి దినము

sri sathyasai vachanamrutam

మనము పండుగ చేసుకొంటున్నాము.

ఈ నవరాత్రులు, శివరాత్రులు, సంకురాత్రులు అనే ఈ రాత్రులంతా కూడను దుష్టులను సంహరించిన పర్వదినములుగా భావించి ఆనాడు పండుగలు చేసుకుంటున్నాము. దుష్టుడు, దుర్మార్గుడు అయిన రావణుని హతమార్చి దుష్టశక్తులపై విజయము సాధించినదినమే విజయదశమి. విద్యావంతుడైనప్పటికిని, ధైర్యసాహస వంతుడైనప్పటికి రావణుని ధర్మహీనునిగా భావించి అతనిని సంహరించిన దినమే ఈ విజయదశమి. అనేక దుష్టశక్తులతో తాండవమాడుతున్న మహిషాసురుని దుర్గ, సరస్వతి, పార్వతి అనే యిచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తి ఈ మూడింటి ఏకత్వము చేత, ఆశ్వీజ శుద్ధ పాడ్యమినుండి నవమివరకుకూడను ఈ ముమ్మూర్తులు ఏకత్వాన్ని ధరించి యుద్ధము ఆచరించిన దినములు. కడపటి దినము నవమి దినము మహిషాసుర మర్దన గావించిన దినము. దానవుల రాజైన రావణుని హతమార్చి అదే దినము అయోధ్యలో పట్టము కట్టుకొన్న దినమే ఈ విజయదశమి. విక్రమాదిత్యుడు భగవంతుని సింహాసనమును అలంకరించిన దినము ఈ విజయదశమి. జైన మత స్థాపకుడైన మహావీరుడు ఈ విజయదశమి రోజుననే పరమపదించాడు. ఈ విధముగా దుష్టశక్తులు సంహరింపబడిన దినములు మరియు అవతార పురుషులు, మహాత్ములు జన్మించిన దినములను భారతీయులు పండుగలుగా భావించి ఆనందాన్ని అనుభవిస్తూ వచ్చారు. కృష్ణుడు ఆదర్శమూర్తి. అన్యాయ, అక్రమ, అనాచారములతో ప్రవర్తించుచున్న కంసుని సంహరించిన తరువాత ఆ రాజ్యమును యితరులకు పట్టము గట్టినప్పుడు దీనికి వుగ్రుడై నరకాసురుడు అనేక పర్యాయములు మధురపై దండెత్తి వచ్చాడు. ఫలితంగా ప్రజలలో ఒక విధమైన భయ, భ్రాంతులు అభివృద్ధి చెందటంచేత మధురవాసులందరికి కూడను శాంతి భద్రతలు చేకూర్చే నిమిత్తమై ద్వారకలో ఒక గ్రామము నిర్మించి అందులో ఈ ప్రజలనందరిని ప్రవేశపెట్టాడు, కృష్ణుడు.

**దుర్గుణములే అసురత్వమునకు చిహ్నములు**

ఈ నరకాసురుడనే రాక్షసుడు పాలన చేయుచున్న గ్రామమే ప్రాగ్జ్యోతిషపురమని పేరు. ఇక్కడ నాలుగు పదములున్నాయి. ప్రాగ్, జ్యోతి, షా, పురం. ఈ నాలుగు పదములకు సరైన అర్థమును మనము గుర్తించినప్పుడు ఈ ప్రాగ్జ్యోతిష పురము మానవునియొక్క

sri sathyasai vahini/vachanamrutam

హృదయమనే అర్థము చక్కగా స్పష్టము గావించుచున్నది. 'ప్రాగ్' అనగా పూర్వము అనగా ముందు అని అర్థము. జ్యోతి అనగా దీపము. షా అనగా మరచటము, పురమనగా దేహము. పూర్వము జ్యోతియైన ఆత్మజ్యోతి, పరంజ్యోతి, సచ్చిదానంద జ్యోతిని మరచటంచేతనే మానవుడు ప్రాగ్జ్యోతిషపురమనే దానిలోపల జీవిస్తూ వున్నాడు. ఇక్కడ ఈ హృదయమునందు, ఈ ప్రాగ్జ్యోతిషపురమందు ఈ రాక్షసత్వములో నిండిన నరత్వము మానవత్వాన్ని విస్మరించింది. నరుడు అనగా ఆత్మ. ఆకాశాది భూతములు ఆవిర్భవించిన ప్రదేశమే నరత్వము. ఈ నరత్వమునందు ఆకాశాది భూతములచే జలమయముగా భావించి 'నారము' అనికూడను పిలుస్తూ వచ్చారు. 'నారము'లనగా జీవులని మరొక అర్థము. నారములకు నిలయమైనది కనుకనే నారాయణుడని పేరు వచ్చింది. 'నర' అనగా ఏమి? 'న' అనగా లేదు. 'ర' అనగా శాశ్వతము అనికూడా అర్థము వస్తుంది 'నరః' అనగా 'శాశ్వతము కాదు' అని అర్థము. నిత్యము, సత్యము అయినది కాదు, మానవత్వము. ఇట్టి నర అనే పురమునందు అసురత్వమనే దుర్గుణములు ప్రవేశించటముచేత అతనే నరకాసురుడౌతాడు. దుర్గుణములే అసురత్వమునకు చిహ్నములు.

**దుర్గుణములతో ప్రవర్తించేవానిని అతని దుర్గుణములే నాశనం చేస్తాయి**

కనుక, 'నర' మరియు 'అసుర' రెండు తత్త్వములు కూడుటచేత అతడు నరకాసురుడు అయిపోయినాడు. నరకాసురుడనగా నరకమునకు గొనిపోయేవాడని మరొక అర్థము. నరకాసురుని చరిత్ర మనము విచారించినప్పుడు అతను మహాదుష్టుడు, దుర్మార్గుడు. ఆ రాజ్యములో బజారునందుగాని, గృహమునందుగాని ఏనాడుకూడను జ్యోతులు వెలిగినటువంటివి గావు. ఆ రాజ్యములో ప్రజలు ఎవ్వరికినీ కనిపించేవారు కాదు. దీపముయొక్క వెలుతురు యేనాడు చూచినవారు కాదు. అంతటి దుర్మార్గుడు యీ నరకాసురుడు. అనేకమంది రాజకన్యలను, అనేకమంది స్త్రీలను, యువతులను తీసుకువచ్చి బంధించి అనేకవిధములుగా చెరసాలయందు హింసించేవాడు. ఈ బాధలను తట్టుకొనలేక అనేకమంది కృష్ణునికి మొరపెట్టుకున్నారు. మానవాళినే నిర్మూలము గావించటానికి ఉద్భవించిన రాక్షసుని సంహరించి జీవనోద్ధారము చెయ్యాలని, మానవకళ్యాణము చేకూర్చాలని యాచించారు. ఎవరిని

srisathyasaivachanamrutam

హింసించినారో వారివలనే మరణము ఏర్పడాలి. కత్తితో సంహరించినవానికి కత్తితోనే మరణము వుంటున్నాది. దుర్గుణములతో ప్రవర్తించే వానిని ఆ దుర్గుణములే హింసిస్తాయి. అదేవిధముగా ఆనాడు స్త్రీలను అనేకవిధములుగా హింసించినటువంటి దుర్మార్గుడు నరకాసురుడు కనుక, స్త్రీలచేతనే అతని సంహరింపజేయాలి. అందు నిమిత్తమై సత్యభామను వెంటగొని ఆ నరకాసురుని సంహరించాలి. ఆ విధంగా నరకాసురుని సంహరించిన దినమే ఈ నరక చతుర్దశి. మరుసటిదినము అమావాస్య. ఆ నరకాసురుని బంధనలోవుండిన పదహారువేలమంది కన్యలను బంధవిముక్తి గావించాడు, కృష్ణుడు. వారిని వారి వారి స్వస్థానములకు పొమ్మని ఆజ్ఞాపించాడు, కృష్ణుడు. కానీ, యీ పదహారువేలమంది గోపికలుకూడను కృష్ణుని పాదములపై బడి, "స్వామీ! యింతకాలము చెరసాలయందు ఈ దుర్మార్గుని వశమునందు వుండుటచేత సమాజములో ప్రతి వ్యక్తికూడను మమ్ములను శంకిస్తాడు. మమ్ములను సమాజము గౌరవించదు. అలాంటి అగౌరవముతో జీవించే జీవితముకంటే నీ పాదములకు అంకితము గావటం చాలా వుత్తమ" మని ప్రార్థించారు.

**గోపికలను ఉద్ధరించి, ఆదరించి, భరించినవాడు కనుకనే కృష్ణునికి 'భర్త' అని పేరు వచ్చింది**

"ఇన్ని విధముల మా ప్రాణములు రక్షించిన నీవు మమ్ములను పోషించలేవా? కనుక, మమ్ములను రక్షించి, ఆదరించి, పోషించవలసినదని" కోరారు. ఇంతలోకాన్నే భరించే నీవు మమ్ములను భరించలేవా? అని ప్రార్థించేటప్పటికి కృష్ణుడు ఈ పదహారువేల మంది గోపికలను నేను రక్షిస్తాను, భరిస్తానని వాగ్దానమిచ్చాడు. ఈ విధంగా పదహారువేలమంది గోపికలను భరించినటువంటివాడు కనుకనే అతనికి 'భర్త' అని పేరు వచ్చింది. భర్త అనగా husband అని, మొగుడని చెప్పటానికి వీలులేదు. 'భరించేవాడు కనుక భర్త' అని, 'భరింపబడేది కనుక భార్య' అని అర్థము. ఈ పదముల అర్థమును గుర్తించుకొనలేక పదహారు వేలమంది గోపికలను పెండ్లాడినాడు కృష్ణుడని ఒక అపవాదముక్రింద కొందరు మాట్లాడుతూ వచ్చారు. శ్రీ కృష్ణునికి కేవలము అంకితమైనవారు, యీ పదహారువేలమంది గోపికలు. వారి జీవితమును వుద్ధరించి, ఆదరించి, భరించినటువంటివాడు కనుకనే కృష్ణునికి 'భర్త' అని పేరు వచ్చింది.

srisathyasaivachanamrutam

ఈ అమావాస్య దినము గోపికలను భరించిన దినము. చతుర్దశిదినము నరకాసురుని వధించిన దినము. ఈ అమావాస్య దినము పూర్ణచీకటిగా వుంటుంది. అంధకారముగా వుంటుంది. ఇంత అంధకారములోపల మా జీవన జ్యోతిని వెలిగించినవాడు కనుకనే ఈనాడు జీవితమనేది అంతా కూడను పౌర్ణమిగా వుండాలని ప్రార్థించారు. కనుకనే ఈనాడు కేవలము అమావాస్య అంధకారము అయినప్పటికిని ఎక్కడ చూచినాకూడను ఈ మతాబులు వెలిగించి అనేక విధములుగా జ్యోతులు వెలిగించి ఒక పూర్ణిమ మాదిరి ఈ రాత్రినంతను అనుభవిస్తూ వచ్చారు. ఆనంద, ఉత్సాహములచేత ఈ విధమైన వైభవములను అనుభవిస్తూ వచ్చారు.

దీనికి వైజ్ఞానికమైన మరొక అర్థముకూడా వుంటున్నది. గడచిపోయినది వర్షాకాలము. ఎక్కడ చూచినా నీరు, బురద ఈ విధమైన మాలిన్యముచేత అనేక విధములైన క్రిమికీటకాదులు అభివృద్ధియైపోతాయి. యిలాంటి క్రిమికీటకాదులచేత మానవునికి అనారోగ్యము అభివృద్ధి అవుతుంటాయి. ఈ దీపావళి అమావాస్య రోజున మతాబులు కాల్చటం చేత, వాటి పొగచేత దాంట్లో ఉండే విషమయమైన మందులచేత ఆ క్రిమికీటకాదులు నశిస్తాయి. తద్వారా మానవునియొక్క ఆరోగ్యము, ఆనందము అభివృద్ధి గాంచుతాయి.

**ఏకైక జ్యోతియైన పరంజ్యోతినుండి అనేకమైన జీవనజ్యోతులు ఉద్భవించాయి**

అనేక విధములైన అంతరార్థములు పురస్కరించుకొనియే భారతీయుల పండుగలు ఏర్పడుతూ వచ్చినాయి. ఇక్కడ మరొక విషయం గుర్తించుకోవాలి. 'ఏకోహం బహుస్యాం' అనే వేదవాక్యమును పురస్కరించుకొని ఈ పర్వదినము నాడు ఒకదానినుండి మరొకటిగా అనేక జ్యోతులు వెలిగించి తమతమ గృహములకు అలంకారము చేస్తూంటారు. మొట్టమొదట ఒక్క జ్యోతిని మాత్రము వెలిగించి ఆ జ్యోతిద్వారా అనేక జ్యోతులను వెలిగిస్తూపోతారు. అయితే, ఇన్ని వేల జ్యోతులను వెలిగించేది, ఒకే ఒక జ్యోతి. ఆ ఒక్క జ్యోతియే అనేక జ్యోతులను వెలిగించుతూ వచ్చింది. ఆ ఏకైక జ్యోతియే పరంజ్యోతి. మిగిలినవి జీవన జ్యోతులు. పరంజ్యోతి ఒక్కటి మాత్రమే! అదే 'ఏకోహం బహుస్యాం.' ఆ ఒక్క జ్యోతియే అనేక జ్యోతులుగా రూపొందింది. అట్టి పారమార్థికమైన అర్థాన్నికూడను నిరూపించిన దినము, ఈ దీపావళి దినము. ఐతే ఈ దీపములంతాకూడను కేవలము బాహ్యమైన అంధకారమును మాత్రమే దూరము గావిస్తున్నవి

srisathyasaivachanamrutam

కాని అంతరంగములోని అజ్ఞానాంధకారమును తొలగించే ప్రయత్నం చేయటం లేదు. ఈ జ్యోతికి మరొక సుగుణముకూడను వుంటున్నది. దీపము ఎక్కడపెట్టినప్పటికి అది ఊర్ధ్వస్థితికే ప్రయాణము అవుతుందిగాని, అధోస్థితికి కాదు. అనగా ఉన్నత స్థాయికే పోతుంది. జ్ఞానమార్గము, పుణ్యమార్గమునకే అది ప్రయాణము సలుపుతుంది.

జ్యోతిని వెలిగించాలంటే నాలుగు పదార్థములు వుండాలి. ఒకటి ప్రమిద, రెండవది నూనె, మూడవది వత్తి, నాలుగవది అగ్గిపెట్టె. ఈ నాలుగులో ఏ ఒక్కటి లేకపోయినా మనము జ్యోతిని వెలిగించలేము. ఈ నాలుగుకూడను తప్పనిసరిగా వుంటుండాలి. అయితే ఈ జ్యోతి ఏ చీకటిని పోగొడుతున్నాది? బాహ్యమైన చీకటిని మాత్రమే పోగొడుతున్నాది. ఒకానొక సమయములోపల హనుమంతుడు సీతాన్వేషణ నిమిత్తమై వెళ్ళి లంకకంతా అగ్గిపెట్టి ఒక పర్వతముపైన కూర్చొని లంకనంతా చూస్తున్నాడు. ఆనాడు చిమ్మచీకటి కమ్ముకున్న లంకా పట్టణమంతా పట్టపగలుగా వెలుగుతున్నాది, ఈ అగ్నిచేత. రావణుడు మహా శక్తివంతుడు. అరువది నాలుగు విద్యలు నేర్చిన ప్రవీణుడు. మహా శక్తి, సామర్థ్యములు కలిగిన మేఘనాధుడు అనే కుమారుడు కలిగినవాడు. బలవంతుడైన కుంభకర్ణుని తమ్మునిగా కలవాడు. మహా శ్రీమంతుడైన కుబేరునికి తమ్ముడైనవాడు. పదితలలు, యిరవై చేతులు కలిగినవాడు. కానీ, యిన్ని కలిగిన యితనిని ఎవరైనా రక్షించగలిగారా? అగ్ని జ్వాలలతో లంకా పట్టణమంతా పట్టపగలుగా వెలుగుతూ వుండినప్పటికిని రావణుని మనస్సులోపల అజ్ఞానమనే అంధకారము చిమ్మచీకటిగా కప్పుకుంటున్నాది. అదే అహంకారము. అదే ఆడంబరము. రాగద్వేషములతో కూడిన రావణాసురుని హృదయము చిమ్మచీకటిగానే వుంటున్నాది. ఈ చీకటిని పోగొట్టేవారు ఎవరు? కేవలము జ్ఞానజ్యోతివల్లనే ఈ చీకటి పోతుంది తప్ప, అన్యజ్యోతులతో ఈ చీకటి పోయేది కాదని స్మరించాడు.

## వైరాగ్యమే లేకుండిన ఎన్ని విద్యలు చదివినా ప్రయోజనం లేదు

ఐతే ఈ జ్ఞానజ్యోతిని ఏ విధముగా మనము వెలిగించాలి? అంతర్గతమైన అంధకారము నిర్మూలము గావించాలంటే ఆత్మజ్యోతి కావాలి. జ్ఞానజ్యోతి నివ్వాలి. దీనికి కూడను నాలుగు పదార్థములు వుండాలి. వైరాగ్యమే దీనికి ప్రమిద. భక్తియే దీనికి తైలము. చిత్తైకాగ్రతే దీనికి

వత్తి. తత్త్వజ్ఞానమే అగ్గిపెట్టె. ఈ నాలుగు లేకుండా వుండిన ఆత్మజ్ఞానమనేది మనకు లభ్యము కాదు. అన్నింటికిని వైరాగ్యమనే ప్రమిద అత్యవసరము. అదే ఆధారమైనది. ఈ వైరాగ్యమే లేకుండిన యింక ఏ విధమైన విద్యలు చదివినప్పటికిని ఎన్ని శాస్త్రములు చదివినప్పటికిని ఎంత వేదములు పఠించినప్పటికిని ప్రయోజనము లేదు. కనుకనే 'నకర్మణా, నప్రజయా, ధనేన త్యాగేనైకే అమృతత్వ మానసుః' అనింది, వేదము.

వైరాగ్యమనగా ఏమిటి? రాగము లేకపోవటమే వైరాగ్యము. దేహమే నేను అదే అహంకారము. ఈ దేహమునకు సంబంధించిన సమస్త పదార్థములు నావి నావి అనే మమకారము. ఈ అహంకారము, మమకారము రెండూ చేరే ఈ రాగముగా మారిపోతున్నాయి. ఈ రాగముచేతనే అజ్ఞానమనే రోగములో పడిపోదుతున్నాడు, మానవుడు. కనుక, ఈ రాగమనే రోగము ఏ విధముగా నిర్మూలము చెయ్యాలి? విచారించాలి. ఈ జాగ్రత ఏమిటి? నిద్ర ఏమిటి? సుషుప్తి ఏమిటి? ఈ మూడు కాలములను మనము చక్కగా విచారణ చేసినప్పుడు జాగ్రత అంతా జడము. దేహమంతా జడమయమైనదే. కానీ నదుస్తుండాది, చూస్తుండాది, మాట్లాడుతుండాది, వింటున్నాది, అనుభవిస్తుండాది. దీనిని జడమని చెప్పటానికి ఏరీతిగా వీలవుతుంది? కాలోచితముగా చైతన్యము ప్రవేశించి జడమును కదలింపచేస్తూ వుంటుండాది. అంతేగాని దేహము చైతన్యము కాదు. గడియారము వుంటుండాది. గడియారమునకు కీయిచ్చినప్పుడు ముండ్లన్ని కదులుతున్నాయి. కదిలినంత మాత్రమున ప్రాణమున్నట్లా? కాదు. ఆ కీ ఆధారముచేతనే ఈ ముళ్లు తిరుగుతున్నాయి. లోపల ఆత్మశక్తివలనే సమస్త అంగములుకూడను పని చేస్తున్నాయి. దీనినే వేదము "నీలతోయదమధ్యస్థా విద్యుల్లేఖేవ భాస్వరా..." అని చెప్తుతుంది. విద్యుల్లేఖ అనేది మన Spinal Columnలోని తొమ్మిది, పన్నెండు పూసల మధ్య వెలిగే దివ్యజ్యోతి, జ్ఞానజ్యోతి. ఈ విద్యుల్లేఖ అక్కడ ఆ విధముగా సంచరించటము చేతనే main switch అయిన heart అనేది పని చేస్తుండాది. ఈ main switch ఆన్‌లో వుండినంతవరకు అన్ని అంగములలో జ్యోతులు వెలుగుతున్నాయి. మనకు తెలుసు, main switch తీసేసి ఏ రూమ్‌లో switch వేసినా లైటు రాదు. ఆ main switch లోపల ఏముంటున్నాదో అదే దివ్యమైన ఆత్మభావము పెట్టుకోవాలి. ఈ దేహమనేది జడమే! అయితే 'పెరుగుతూ వుండాదే, తరుగుతూ వుండాదే', అని కొంతమందికి సందేహము కలుగవచ్చు.

పెరగటము, తరగటములో చైతన్యమును గుర్తించటానికి వీలవుతుందా? ఇది చైతన్యమని చెప్పటానికి సాధ్యమవుతుందా? ఇల్లంతా వూడ్చి దినము యింత చెత్త తీసుకొని ఒక గుంతలో వేస్తాము. ఈ విధముగా ఒక నెల రోజులు వేసేటప్పటికి దిబ్బ పెరిగిపోతుంది. ఈ దిబ్బ పెరగటానికి చైతన్యమా కారణము? చెత్త వేస్తూ వేస్తూ వుంటే దిబ్బ పెరుగుతూ పెరుగుతూ పోయింది. అదేవిధముగానే దినము యిడ్లీ సాంబారు, ముద్దపప్పు అన్నీ వేస్తూవేస్తూ వుంటే ఈ దేహమనే దిబ్బ పెరుగుతున్నాది. ఇదంతా చెత్త. మనము తినే తిండంతా చెత్తతో సమానము. ఈ చెత్తను వేయకుండా పదిదినములు పెట్టండి, అస్థిపంజరమైపోతుంది. తగ్గిపోతుంది. కాబట్టి యిది చైతన్యమని చెప్పటానికి వీలులేదు. నిస్సంశయముగా దేహము జడమే!

**జాగ్రత్స్వప్న సుషుప్తులయందలి అనుభూతులన్నీ అనిత్యము, అశాశ్వతములనే సత్యాన్ని గుర్తించటమే వైరాగ్యము**

ఈ విధముగా విచారణ చేస్తూ చూచినప్పుడు, మనము రాత్రి పండుకున్నాము, ఈ దేహము ఒక పరుపుపైన పడిపోయింది ఒకమాంసము ముద్దవలె. కన్నులు, చెవులు, నోరు, ముక్కు, కాళ్లు, చేతులు అన్నీ వుంటున్నాయి అని అనుకుంటున్నాము. రాత్రి స్వప్నములో ఏమేమో మాట్లాడుతున్నాము, ఎవరితోనో పోట్లాడుతున్నాము, ఎక్కడెక్కడో తిరుగుతున్నాము, ఎన్ని పనులో చేస్తున్నాము. ఎవరెవరినో చూస్తున్నాము. ఏమేమో వింటున్నాము. అక్కడ వినేది ఎవరు చెప్పు? అక్కడ సంచరించిన పాదములు ఎవరివి? అక్కడ పనులు చేసిన చేతులు ఎవరివి? అక్కడ మాట్లాడిన నోరు ఎవరిది? అక్కడ చూచిన కన్నులు ఎవరివి? ఎవరు నీవు? అంతా మాయ. అన్నీ చూశావు, అన్నీ చేశావు, అన్నీ విన్నావు, అన్నీ చెప్పావు. కానీ ఎంతవరకు యిది? మెలకువ వచ్చేటప్పటికి అంతా పోయింది. కలలో చూచినవన్నీ కూడను జగత్తులో మాయ. కలలో వుండినప్పుడు జగత్తు శూన్యము. జాగ్రతలో కల లేదు. కాబట్టి కలలో అది మాయ. సుషుప్తిని మనము విచారించుకుందామంటే యిది కేవలము ఒక ప్రతిబింబమే! అది కారణ స్వరూపమైనటువంటిది. ఆ కారణము దేనియొక్క Reflection? మహాకారణముయొక్క Reflection. కనుక, ఈ మూడు స్థానములందు మనము విచారించినప్పుడు ఏదీ శాశ్వతము లేదు. జాగ్రతలో ఉన్న దేహము స్వప్నములో లేదు, స్వప్నములో చూచిన మాయ సుషుప్తిలో

srisathyasaivachanamrutam

కనిపించదు. కనుక, యివన్నీ కేవలము అనిత్యము, అశాశ్వతములనే సత్యాన్ని గుర్తించటమే వైరాగ్యమన్నారు. అన్నీ వదలిపెట్టమని కాదిక్కడ. ఈ దేహమును ఆధారముగా పెట్టుకొని నీవు చేయవలసిన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. ఈ విధమైన కర్తవ్యమును నిర్వర్తించే నిమిత్తమై కాయమును మనకు అనుగ్రహించాడు, భగవంతుడు. అయితే, ఈ కాయము ఏ రీతిగా పరోపకార సంబంధమైన పనులలో ప్రవేశపెట్టాలి? స్వార్థ, స్వప్రయోజనముల నిమిత్తమై దీనిని ప్రవేశపెట్టకూడదు. ఈ యింద్రియములయొక్క శక్తి, సామర్థ్యములచేత పరులకు ఆనందము నందించే త్యాగ భావము కలిగివుండాలి. "శరీరమాద్యం ఖలు ధర్మసాధనమ్." ఈ శరీరమనేది ధర్మాచరణ నిమిత్తమై ఏర్పడినది.

**ధర్మమనగా మన హృదయమునకు సమ్మతమైన మార్గమును అనుసరించటం**

ధర్మమనగా ఏమిటి? తెల్లవారి స్నానము చేయటం, సంధ్యావార్చటం, భోజనం చేయటం, ఇవా ధర్మములు? ఇతరులు తనను ఏ విధముగా గౌరవించాలని ఆశిస్తున్నాడో ఆ విధముగా తాను యితరులను గౌరవించాలి, అదే నిజమైన ధర్మము. ఇతరులు ఏ విధముగా వుంటుంటే మనము మంచిదని భావిస్తున్నామో మనము ఆ విధముగా మంచిగా వుండాలి. ఇతరులు ఏమి చేస్తే దోషమని మనము నిందిస్తున్నామో ఆ దోషము మనము చేయకుండా వుండాలి. అదే నిజమైన ధర్మము. ధర్మమనగా మన హృదయానికి సమ్మతమైన మార్గమును మనము అనుసరించాలి. హృదయసాక్షిగా మనము అనుభవించాలి. ఇదే నిజమైన ధర్మమన్నారు. దీనినే follow the master. నీ యొక్క హృదయాన్ని నీవు అనుసరించు. అప్పుడే నీకీ వైరాగ్యము ప్రాప్తిస్తుంది. Face the devil. దీని నిమిత్తమై Fight to the end, Finish the game యిదే నీ జీవిత లక్ష్యము. ఇలాంటి రహస్యాన్ని, యిలాంటి సత్యసూక్తులను లోకానికి అందించే నిమిత్తమై అనేక విధములుగా అవతార పురుషులు తమ జీవితాలను పవిత్రమైన మార్గములో ప్రవేశపెడుతూ వచ్చారు. కబీరు కూడను చెప్పాడు. "దుర్మార్గులకు నమస్కారము; సన్మార్గులకు నమస్కారము" అన్నాడు. ఇరువురికి నమస్కారము చేయటములో అంతరార్థము వుంటున్నాది. దుష్టులు, దుర్మార్గులు అయిన వారికి నమస్కారము చేయటములో అంతరార్థము వుంటున్నాది. దుష్టులు, దుర్మార్గులు అయిన వారికి నమస్కారము ఎందుకు చెయ్యాలి? అప్పుడు కబీరు

sri sathyasai vachanamrutam

చెప్పాడు, “ఓ దుర్మార్గులారా! మీ యొక్క సంయోగము నాకు వుండకూడదు కనుక మీకు నమస్కారము.” “ఓ సన్మార్గులారా! మీతో వియోగము కలుగకూడదు కనుక మీకొక నమస్కారము.” దుర్మార్గులతో “అయ్యా! నీతో సంబంధము నాకు వద్దు ఒక నమస్కారము, దూరముగా పొండి” అని వారికి నమస్కారము చేయటము, సన్మార్గులను “అయ్యా! నీవు పోవద్దు, నన్ను వదలవద్దు, నీ సంయోగము వదలి వుండలేను,” అని వానికొక నమస్కారము. ఈ విధముగా దుష్టులకు నమస్కారము చేసి దూరము పెట్టాలి. మంచివానికొక నమస్కారము చేసి సర్వము అర్పితము గావించుకుంటే యిదే నీకు ధర్మము. అనగా దుష్టభావములు, దుష్టశక్తులు, దుష్టాచారములు, దుష్టసంకల్పములు మనము దూరమునెట్టి సద్భావములు, సదాచారములు, సద్గుణములు, సత్సంపత్తిని మనందరము అభివృద్ధి గావించుకుంటూ పోవాలి. దీనినే వేదమునందుకూడను “మనము భగవంతుని బిడ్డలము. అందరం కలసి మెలసి వుంటుండాలి. అందరం మనశక్తిని సద్వినియోగము చేసుకోవాలి,” అని ప్రబోధిస్తూ వచ్చింది. “అదే మనకు శాంతి”, అని చెప్పింది. “సహనా వవతు, సహనౌ భునక్తు, సహవీర్యం కరవావహై” ఈ విధముగా మనము కలసిమెలసి వుందాము.

**కలసి మెలసి తిరుగుదాం కలసి మెలసి మెలగుదాం**
**తెలుసుకున్న సత్యమును తెలివితో బోధించుదాం**

అందరూ కలసిమెలసి వుంటుండాలి. అంతేకాదు కలసి మెలసి కలతలేక కలసి మనము జీవిద్దాం అనింది. ఈ విధముగా వేదమునందు అనేకత్వములో వున్న ఏకత్వమును ఎంతగా బోధించినప్పటికిని స్వార్థము, స్వప్రయోజనము కలిగినవారు ఎప్పుడుకూడను భిన్నత్వాన్నే భావించుకుంటూ పోతున్నారుగానీ ఏకత్వమునందు ఏమాత్రముకూడను మనసును ప్రవేశపెట్టటం లేదు.

**పర్వదినములలోని విశిష్టమైన ధర్మమును గుర్తించాలి**

అనేకమైన పర్వదినములలో వుండిన విశిష్టమైన ధర్మాన్ని మనము గుర్తించాలి. దుష్టులను నశింపచేసి, దుష్టుల మరణముచేత లోకమునకు ఒక విధమైన శాంతి భద్రతలు చేకూరింది అనే ఉద్దేశ్యముతో ఆయా దినములను పండుగలుగా మనము అనుభవిస్తూ వచ్చాము.

srisathyasaivachanamrutam

నరకాసురుడనగా మనలో వున్న దుర్గుణములను యీనాడు మనము సంహారము చేయాలి. అందులో దాగివున్న పదహారు వేలమంది గోపికలే సద్గుణములు. ఈ సద్గుణములనే గోపికలను మనము పరమాత్మునికి అంకితము చెయ్యాలి. అటువంటి రక్షణలోనే ఈ తత్త్వము పోషింపచేసుకోవాలి. కనుక, ఈ విధమైన అంతరార్థమును ప్రబోధించిన దినము నరక చతుర్దశి. ఆనందమును అనుభవింప చేసిన దినము కనుకనే జగత్తంతా దేదీప్యమానముగా వెలుతురుతో నిండి వుండాలని వెలుగును మనము అభివృద్ధి చేస్తున్నాము. దీపములు ముట్టిస్తున్నాము. ఏనాడు కూడను వెలుగుచూడనివారు, నరకాసురునియొక్క చెరలో వుండిన స్త్రీలు. ఈ బంధ విమోచన జరిగిన తరువాత ఆనాడు వారు లైట్లంతా చూస్తూ వచ్చారు. దీపములు చూస్తూ వచ్చారు. దీపములు వెలిగిస్తూ వచ్చారు. అసురత్వమనే దుర్గుణము మనలో వుండినంతవరకు మనకు ఎప్పుడూ చీకటే! ఈ దుష్ట దుర్గుణము మనలో వుండినంతవరకు మనకు ఎప్పుడూ చీకటే! కనుక, ఈ దుష్టశక్తులను మనము దూరము చెయ్యాలి. దుష్ట భావములు సంహరించాలి. దివ్యత్వాన్ని వెలిగించాలి. పవిత్రములో నింపాలి. ఈ విధమైన అంతర్బోధ గావించిన దినమే ఈ నరక చతుర్దశి. ఈ పవిత్రమైన స్థితి మనము పొందగలిగినామనే ఆనందోత్సాహములచేత ఈ విధమైన మతాబులు అంతా కాలుస్తూ వచ్చారు. నరకాసురుని సంహరించిన శబ్దమునకు గుర్తుగా టపాసులతో శబ్దమును పేల్చుకుంటూ వచ్చారు. ఈ శబ్దమును విన్నప్పుడంతాకూడను ఈ పదహారువేల గోపికలలోపల 'ఓ! వాని శిరస్సు ఖండించినాడు కృష్ణుడు' అనుకోటం, ఈ విధంగా ఆనందాన్ని అనుభవించటము. నరకాసురుని సంహారమును జ్ఞప్తికి తెచ్చుకునేందుకు ఈ దినమును నరక చతుర్దశిగా భావిస్తూ వచ్చారు.

**ప్రకృతిని హింసించిన వ్యక్తిని ప్రకృతిచేతనే హింసింపజేయాలి-ఇదే ప్రకృతి ధర్మము**

ఏ విధమైన గుణములతో మనము జీవిస్తామో, ఆ గుణములయొక్క స్వభావము మనలను శిక్షిస్తుంది. స్త్రీలను హింసించినవాడు కనుకనే నరకాసురుడు స్త్రీచేతనే హింసించబడ్డాడు. 'యద్భావం తద్భవతి.' కనుకనే కృష్ణుడు ఏమాత్రము యుద్ధములో ప్రవేశించలేదు, ప్రక్కనుండి

srisathyasaivachanamrutam

ప్రోత్సహించాడు. అయితే దీనికి మరికొన్ని కథలు కూడా వుంటున్నాయి. నరకాసురుడు ఆగ్నేయాస్త్రం వేయటంవలన కృష్ణుడు మూర్ఛిల్లినట్లు, అతని మూర్ఛకు సహించుకోలేక సర్వ విద్యలు నేర్చుకున్న సత్యభామ తానే అతనివద్దనున్న అంబును తీసుకొని యుద్ధమును ప్రారంభించినట్టు కొన్ని చరిత్రలు రాస్తూ వచ్చారు. కానీ యిది సరియైనది కాదు. సత్యభామ ప్రకృతి స్వరూపిణి; ఆమెను కేవలము కృష్ణుని భార్యగా మనము భావించరాదు. ప్రకృతిని సర్వవిధములైన అన్యాయములకు గురిచేసిన మానవుని ప్రకృతిచేతనే హింసింపచేయాలి. ఇదే ప్రకృతి యొక్క ధర్మము, Law of Nature. ప్రకృతిని బాధపెట్టినవాడు ప్రకృతిచేత శిక్షింపబడాలి. ఈ విధముగా అనేక అంతరార్థముల చేత ఈ పర్వదినములను మనము అనుభవిస్తూ వస్తున్నాము. నవరాత్రులుకూడను అట్లనే! దుర్గ, లక్ష్మి, సరస్వతి ముగ్గురు ఏకమూర్తులై చాముండిగా స్వరూపము ధరించి మహిషాసురుని మర్దన గావించిన దినము. పాడ్యమినుండి నవమివరకు యుద్ధము చేయటమువలనే ఈ తొమ్మిది దినములు ఒక పూజగా మనము చేస్తూ వచ్చాము. దుర్గ, లక్ష్మి, సరస్వతులు వేరు వేరు స్త్రీ రూపములు కాదు. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తిలకు వారు ప్రతిరూపములు. ఇచ్ఛాశక్తి దుర్గ. క్రియాశక్తి లక్ష్మీ, జ్ఞానశక్తి, సరస్వతి. ఈ మూడింటి ఏకత్వముచేతనే సమ్మిళితమైన స్వరూపమే మహాశక్తిగా మారింది. ఈ మహాశక్తి చేతనే, మహిషాసురుడు హతమైపోయాడు. అందుచేత నవమి రోజు ఆయుధ పూజ అని, యింక ఆయుధములతో పనిలేదని చెప్పి ఆయుధములకు విశ్రాంతి యిస్తూ వచ్చారు. రాక్షస నాయకుడతను. ఇంద్రాది దేవతలను జయించాడు. కాని, అట్టిక్రూరుని సంహరించిన దినము కనుక ఈ దినము ఆయుధపూజగా మనము చేసుకుంటూ వచ్చాము.

### పర్వదినములకు సరైన అర్థములు గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి

ఇట్లా ఒక్కొక్క పండుగకు అంతరార్థములు వుండటముచేతనే భారతీయులు ఆరాధనా రూపకముగా, ఒక భగవత్ స్వరూపకముగా భావిస్తూ వచ్చారేగానీ కేవలము ఒక మూర్ఖత్వముగాగాని, అమాయకత్వముగాగాని చేసుకుంటూ వచ్చే పూజలు కావు, యివి. యివన్నీ మూఢనమ్మకములని చెప్పి బోధించేవారు లేకపోలేదు. అంతరార్థములు తెలియకపోవటంచేతనే వారు ఆ రీతిగా విశ్వసిస్తున్నారు. ఒక్కొక్క పండుగయొక్క అంతరార్థము ప్రబోధించే మహనీయులు

sri sathyasai vahanamrutam

లేకపోటంకూడా దీనికి ఒక కారణము. పర్వదినములలో ఏ ఒక్కటికూడా అర్థము లేకుండా భారతీయులు అనుసరించినవారు కాదు. ప్రతి దానికి అంతర్‌బహిరర్థములు వుంటున్నాయి. అవి ప్రాచీన కాలమునుండి మహర్షుల తత్త్వముచేతనే అభివృద్ధి అవుతూ వస్తున్నాయి. కనుక, మన పర్వదినములకు సరైన అర్థములు గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలని ఆశిస్తున్నాను. నరకాసుర సంహారమనగా ఏమిటి? మన యందున్న అసురత్వమును సంహారము చేయటమే! కనుక ఈనాడు మనము నరకాసుర సంహారమును ఒక పర్వదినముగా జరుపుకోవటంలో వున్న అంతరార్థమేమనగా మనలో వున్న ఈ దుర్గుణములను, అసురత్వమును, దురాలోచనలు, దుశ్చింతలు దుశ్చర్యలను దూరము చేసుకొని సద్భావములు, సదాలోచనలు, సశ్చింతనలు అభివృద్ధి పరచుకోవాలని ఆశిస్తూ ,ఆశీర్వదిస్తూ, నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ. 09-11-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam